

మదనపల్లిలో ఫోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫోక్సో కేసు నమోదైనట్లు ఎస్ఐ హరిహర ప్రసాద్ తెలిపారు. మదనపల్లె మండలం, మాలేపాడు పంచాయతీకి చెందిన ఓ 15 ఏళ్ల బాలికను అదే పంచాయతీకి చెందిన ఓ యువకుడు ప్రేమ పేరుతో లొంగదీసుకున్నాడన్నారు. ఈ విషయం ఇంట్లో తెలియడంతో పెళ్లికి ఒప్పుకోలేదని ప్రియురాలిని వెంట తీసుకొని వారం రోజుల కిందట ఇంటి నుంచి పరారయ్యారు. యువతి తల్లిదండ్రుల ఫిర్యాదుతో బాలికను వెంట తీసుకెళ్లిన యువకులపై ఫోక్సో, కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరూ మంగళవారం రాత్రి స్థానిక చిత్తూరు బస్టాండ్‌లో ఉండగా ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామన్నారు. తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్ప చెప్తామని ఎస్ఐ తెలిపారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- మహిళా ద్రోహి సిఎం జగన్
- అధికారంలోకొస్తే మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం
- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్



మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 38వ రోజుకు చేరుకుంది. బుధవారం పీలేరు నియోజకవర్గంలోని చింతపర్తి బోయపల్లి క్రాస్ నుంచి నుంచి ప్రారంభమైన పాదయాత్ర విటలం, పునుగుపల్లి, వాల్మీకిపురం, ఆర్‌టిసి బస్టాండ్, మదనపల్లె మండలంలోని పూలవాండ్లపల్లి వరకూ పాదయాత్ర సాగింది. పూలవాండ్లపల్లి వద్ద విడిది కేంద్రంలో బస చేశారు. 13.9 కిలోమీటర్లు సాగిన పాదయాత్ర సందర్భంగా ఆయా ప్రాంతాల్లో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలతో ముఖాముఖి, మైనార్టీలు, స్థానికులతో మాటామంతి కార్యక్రమాలు నిర్వహించారు. చింతపల్లి విడిది కేంద్రం వద్ద లోకేష్‌ను ఫిజియోథెరపి అసోసియేషన్ నాయకులు కలిసి తమ సమస్యలు వివరించారు. మాజీ మంత్రి దేవినేని ఉమా పాదయాత్రలో పాల్గొని లోకేష్‌కు సంఘీభావం తెలిపారు. పాదయాత్ర సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ చట్టాల ద్వారా మాత్రమే మహిళలకు రక్షణ రాదని, చిన్న వయస్సు నుండే మగ వాళ్లకు మహిళల గౌరవం తెలిసేలా ప్రత్యేక పాఠ్యాంశాలు ఉండాలన్నారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే కేజీ నుండి పీజీ వరకూ మహిళల గొప్పతనం, వారు పడే కష్టాలు తెలిసేలా ప్రత్యేక పాఠ్యాంశాలు పెడతామన్నారు. జగన్ పాలనలో మహిళలకు రక్షణ లేదని, కేంద్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం 52 వేల మంది మహిళలపై వేధింపులు జరిగాయని వివరించారు. విద్యా రంగంలో ఇంకా మహిళలు వెనకబడి ఉన్నారని, ఎక్కువ మంది మహిళలు చదువుకోవడానికి, డ్రాప్ అవుట్స్ లేకుండా చేయడానికి టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. ప్రత్యేక కళాశాలలు, ఉన్నత విద్యకు సహాయం, విదేశీ విద్యకు సహాయం అందిస్తామన్నారు. వైసిపి ప్రభుత్వంలో భద్రత విషయంలో కానీ, జీతాల విషయంలో కానీ మహిళలకు సమాన హక్కులు లేవని, సమాన వేతనం కోసం టిడిపి హయాంలో అనేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అనేక పరిశ్రమలు తీసుకొచ్చినప్పుడు మహిళలకు ప్రత్యేకంగా ఉద్యోగాలు కల్పించడంతో పాటు మంచి జీతాలు ఇవ్వాలని మేము కంపెనీలను కోరేవాళ్ళం, మళ్లీ టిడిపి అధికారంలోకి రాగానే అన్నింటినీ పరిశీలించి తప్పక పరిష్కరిస్తామన్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న సంఘమిత్రలను వైసిపి ప్రభుత్వం తొలగించిందని, ఎన్నికల ముందు కులం, మతం చూడమని, ఇప్పుడు ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్ల దగ్గర నుండి సంఘమిత్రల వరకూ అడ్డగోలుగా తొలగిస్తున్నారన్నారు. ఆఖరికి డ్వాక్రా మహిళలు దాచుకున్న అభయహస్తం డబ్బులు కూడా జగన్ ప్రభుత్వం కొట్టేసిందన్నారు. చంద్రబాబు సిఎం కాగానే సంఘ మిత్రలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇంటి పట్టాకు వన్ టైం సెటిల్మెంట్‌లో రూ.10 వేలు కట్టించుకోవడం దారుణమన్నారు. వన్ టైం సెటిల్మెంట్ ఒక పెద్ద మోసమని, రూ.10 వేలు కట్టించుకొని ఇచ్చిన ధ్రువ పత్రం తీసుకొని రుణం కోసం బ్యాంక్‌కు వెళ్తే బయటకి పొమ్మని తిడుతుండడం బాధాకరమన్నారు. మహిళలని మోసం చేసింది సిఎం జగన్ అని, దిశ చట్టం లేకుండానే జగన్ హడావిడి చేశారని, 900 మంది మహిళలపై అత్యాచారాలు జరిగితే 21 రోజుల్లో ఒక్కరికీ న్యాయం జరగలేదన్నారు. సంపూర్ణ మద్యపానం నిషేదం తర్వాత ఓట్లు అడుగుతానని, ఇప్పుడు ఏకంగా జే బ్రాండ్ లిక్కర్ తయారు చేసి అమ్ముతున్నారని, తాగుబోతులను తాకట్టు పెట్టి రూ.25 వేల కోట్లు అప్పు తెచ్చాడన్నారు. టిడిపి హయాంలో ఇలాంటివి ప్రోత్సాహంచే ప్రసక్తేలేదన్నారు. వైసిపి కేసులకు బయపడొద్దని, అక్రమ కేసులు పెట్టిన అధికారులపై టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే జ్యూడిషియల్ ఎంక్వైరీ వేసి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే విదేశీ విద్య పథకాన్ని అమలు చేస్తామని, గతంలో నేరుగా కళాశాలలకే ఫీజురీయిం బర్స్‌మెంట్ చేసే వాళ్ళమని, జగన్ ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఆపేసి విద్యా దీవెన, వసతి దీవెన పెట్టి మోసం చేస్తున్నారన్నారు. ప్రతి ఏడాది రూ.32 వేల నుండి రూ.38 వేల ఫీజు ఉంటే తల్లి ఖాతాలో రూ.10 వేలు వేసి చేతులు దులుపుకుంటున్నారని, ఈ ఏడాది ఆ రూ.10 వేలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. హామీ ఇవ్వని సంక్షేమ కార్యక్రమాలు కూడా అమలు చేసింది చంద్రబాబు నాయుడని, అన్న క్యాంటీన్, విదేశీ విద్య, పండుగ కానుకలు, చంద్రన్న భీమా, పెళ్లి కానుకలు ఇచ్చింది చంద్రబాబు నాయుడే అన్నారు. రూ.200 ఇస్తున్న పెన్షన్ రూ. 1800లు పెంచి, రూ.2000 చేస్తే జగన్ వచ్చిన తరువాత అనేక సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేశారని దుయ్యబట్టారు. పండుగ కానుకలు, పెళ్లి కానుకలు, విదేశీ విద్య, అన్న క్యాంటీన్, 100 సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేసింది సిఎం జగన్ కాదా అని ప్రశ్నించారు. కరెంట్ ఛార్జీలు ఏడు సార్లు పెంచాడని, 8వ సారి మళ్లీ పెంచబోతున్నాడన్నారు. ఆర్టీసి ఛార్జీలు మూడు సార్లు పెంచి పెట్రోల్, డీజిల్ ధరల్లో జగన్ దేశంలోనే నంబర్ వన్ అని, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశానికి అంటాయన్నారు. సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేసిన చరిత్ర జగన్‌కి మాత్రమే దక్కిందని ఆరోపించారు. టిడిపి మహిళా రాష్ట్ర అధ్యక్షులు అనిత మాట్లాడుతూ జగన్ పరిపాలనలో మహిళలకు గౌరవం, రక్షణ, భరోసా లేవన్నారు. వైసిపి పాలనలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని, గంజాయి మత్తులో మృగాళ్ళు రెచ్చిపోతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి అమర్‌నాథరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, సర్పంచ్ మహిత, నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మహిళలతో సెల్ఫీ తీసుకుంటున్న నారా లోకేష్

ప్రచార హోరు!

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ జోరు
- అధికార, ప్రతిపక్ష కేడర్‌పైనే మద్దతుదారుల ఆశలు
- ఎన్నికల ప్రచారంలోకి హేమాహేమీలు
- ప్రధాన సమస్యలు పట్టని ప్రత్యర్థులు

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం పతాకస్థాయికి చేరుకుంది. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పిడిఎఫ్ అభ్యర్థులు స్పష్టమైన విధానాలతో ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఎన్నికల గడువు దగ్గర పడుతున్న కొద్దీ అభ్యర్థులు వ్యూహాత్మక ఎత్తుగడలతో పైచేయి సాధించడానికి ఆరాటపడుతున్నారు. ఎన్నికల బరిలో దిగిన 51 పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మద్దతు మీద ఆశలు పెంచుకున్న అభ్యర్థులు ఆయా పార్టీల కేడర్, ప్రలోభాలపై ఆశలు పెంచుకుని ప్రచారం సాగిస్తుండడం గమనార్హం.



ప్రచారం నిర్వహిస్తున్న పట్టభద్రుల పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి పోతుల నాగరాజు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 39 మంది పట్టభద్ర స్థానానికి, 12 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి బరిలో దిగిన సంగతి తెలిసిందే. పిడిఎఫ్ తరుపున పట్టభద్ర స్థానానికి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి కత్తి నరసింహారెడ్డి పోటీ చేస్తున్నారు. పిడిఎఫ్ అభ్యర్థులిద్దరూ మండలి పరిధిలోని ప్రధాన సమస్యలను ప్రస్తావిస్తూ ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. రాయలసీమ ఎడారి సీమగా మారిన నేపథ్యంలో పిడిఎఫ్ అభ్యర్థులు స్పష్టమైన విజన్‌తో సీమ సమస్యలను ప్రస్తావిస్తూ ప్రచారం సాగిస్తున్నారు. సోషల్ మీడియా, కరపత్రాలు, ఉద్యోగ సంఘాల యూనియన్లు, ప్రజా సంఘాల సహకారంతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు.

ప్రధాన పార్టీల కేడరే సర్వస్వం

అధికార, ప్రతిపక్ష పార్టీల మద్దతు పొందిన అభ్యర్థులు పార్టీ కేడర్‌లతో వరుసగా సమావేశాలు నిర్వహించడం, వాటిపై ఆధారపడి ఎన్నికల ప్రచారాన్ని సాగిస్తున్నారు. వైసిపి అభ్యర్థి ఎమ్మెల్యేల సహాయంతో పార్టీ కేడర్‌లతో సమావేశాలు నిర్వహించడం, ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలపై ఆధారపడడం తెలిసిందే. ప్రచార ప్రారంభ సమయంలోనే టిఫిన్ బాక్సుల ప్రలోభాలకు తెరతీయడం వంటి అనైతిక పద్ధతుల ద్వారా ఎన్నికల ప్రచారాన్ని సాగించడం తెలిసిందే. టిడిపి అభ్యర్థి రిజిష్టర్ పోస్టుల ద్వారా ఓటర్లను అభ్యర్థించడం, పార్టీ కేడర్‌పై ఆధారపడి ఎన్నికల ప్రచారం సాగించడం వంటి విధానాలతో ముందు కెళ్తుండడం గమనార్హం. ఏదేమైనా ఎన్నికల ప్రచారంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మద్దతుపై ఆధారపడిన అభ్యర్థులు తమను గెలిపిస్తే ఫలానా లక్ష్యాలను సాధిస్తామని స్పష్టంగా ఓటర్లకు హామీలు ఇవ్వడం లేదు.

ప్రధాన పార్టీల నాయకుల వరుస పర్యటనలు

ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీ ఫైనల్‌గా భావిస్తుండడం అధికార, ప్రతిపక్ష పార్టీలకు కత్తిమీద సాములా మారినట్లు తెలుస్తోంది. ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపీలు, టిడిపి పరిశీలకులతోపాటు తాజాగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచెన్నాయుడు, వామపక్షాల రాష్ట్ర నాయకులు ఎన్నికల ప్రచారాల్ని పర్యవేక్షించడం ఎమ్మెల్సీ ఎన్నికల వ్యవహారం ఉత్కంఠను కలిగిస్తుండడం గమనార్హం. అన్ని పార్టీలు తమ కేడర్‌ను సమాయత్తం చేస్తుండడం ఎన్నికల వ్యవహారం వేడెక్కింది.

ప్రధాన పార్టీలకు పట్టని ప్రాజెక్టులు

అధికార, ప్రతిపక్ష పార్టీల మద్దతు పొందిన అభ్యర్థులు సీమ సమస్యలు పట్టని వాతావరణం కనిపిస్తోంది. రాయలసీమ వెనుక బాటుతనానికి ఫలానా సమస్యలు కారణమని చెప్పకపోవడం, ఫలానా పరిశ్రమలను తెచ్చేందుకు కృషి చేస్తామని ప్రచారం చేయక పోవడం గమనార్హం. జిల్లాలో జిఎన్‌ఎస్ఎస్ ఫేజ్-2లోని ఒకటి, మూడు మినహా మిగిలిన ఐదు ప్యాకేజీలు కోల్డ్‌స్టోరేజీకి పరిమితం కావడం తెలిసిందే. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2లో మొగమేరు అక్విడక్ట్ నిర్మాణం వెక్కిరిస్తోంది. ఇటువంటి ప్రధాన సమస్యను విస్మరించడం క్షంతవ్యం కాని పని. యురేనియం నిర్వాసిత గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడంలో ఏళ్లూపూళ్లూ గడిచిపోతున్న సంగతి తెలిసిందే. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇటువంటి ప్రధాన సమస్యలను మాటమాత్రమైనా ప్రస్తావించడం లేదు.

'సీమ' సమస్యలే పిడిఎఫ్ అజెండాగా..

పిడిఎఫ్ అభ్యర్థులు రాయలసీమ కన్నీటిని తుడవడానికి మండలిలో గళం వినిపిస్తామని ప్రచారం సాగించడం ఆకట్టు కుంటోంది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనుల దగ్గర నుంచి గండికోట, సోమశిల నిర్వాసితుల పరిహారం, మొగమేరు ఆక్విడక్ట్ పనుల పెండింగ్, కెసికెనాల్ ఆయకట్టు స్థిరీకరణ, సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ, కొప్పర్తిలో పరిశ్రమల ఏర్పాటు, యురేనియం విస్తరణ దుష్ప్రభావం, బ్రహ్మాసాగర్, సర్వరాయసాగర్, వామికొండ, చిత్రావతి లీకేజీలు వంటి సమస్యలై ముందుకు వెళుతున్నారు. సీమ జిల్లాల్లోని పెండింగ్ ప్రాజెక్టులు, పరిశ్రమల సాధనకు పాటుపడతామని ఎన్నికల ప్రచారం సాగించడం ఓటర్లను విశేషంగా ఆకర్షిస్తోంది. ఏదేమైనా పోలింగ్ నాటికి ఓటింగ్ పోలరైజే షన్‌లో ఎవరు పైచేయి సాధిస్తారో వేచి చూడాల్సి ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

ఆరు సూత్రాలు అమలు చేస్తాం : తులసిరెడ్డి

రాయచోటి : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఆరు సూత్రాల కార్యక్రమం అమలు చేస్తామని కాంగ్రెస్ మీడియా చైర్మన్ డాక్టర్ తులసి రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రానికి ఒక శని గ్రహంలా బిజెపి, రాహుకేతువులుగా వైసిపి టిడిపి దాపురించాయని పేర్కొన్నారు. సీమాంధ్ర స్వర్ణాంధ్ర అవుతుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాల వల్ల గిట్టుబాటు కావడం లేదని, రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోయారని పేర్కొన్నారు. అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్ప డుతున్నారు. రైతుల ఆత్మహత్యల్లో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ 3వ స్థానంలో ఉందని విమర్శించారు. రైతులను అప్పుల ఊబి నుండి బయటకు తెచ్చేందుకు వ్యవసాయ రుణాలు మాఫీ, రూ.500లకు గ్యాస్ సిలిండరు, ప్రతి నిరుపేద కుటుంబానికీ రూ.6 వేలు, రాష్ట్రానికి సంజీవని లాంటి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాయలసీమలో, ఉత్తరాంధ్రలో, బుందేల్‌ఖండ్ తరహా అభివృద్ధి చేస్తామన్నారు. కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్, దుగ్గరాజు పట్టణంలో ఓడరేవు, పోలవరం ప్రాజెక్టు, విశాఖ మెట్రో జోన్, విజయవాడ మెట్రో, విశాఖ రైల్వే జోన్ సమస్యలను కాంగ్రెస్ పార్టీ పరిష్కరిస్తుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి అల్లాబకాష్, ఖాదర్‌బాషా, చెన్న కృష్ణ, మహబూబ్‌బాషా, రమణమ్మ, ఎస్ ఎండి గౌస్, ఖాదర్ ఖాన్, జాఫర్, షఫీ, పాల్గొన్నారు.

'బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు'

రాయచోటి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషిచేయాలని కలెక్టర గిరీష పిఎస్ పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ గిరీష పిఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియ, ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి కేక్ కట్ చేసి మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ చర్యలు చేపట్టి బాలికా విద్యను ప్రోత్సహించాలన్నారు. తల్లిదండ్రులు ఆడ మగ తేడా లేకుండా పిల్లలిద్దరినీ సమానంగా చదివించాలన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలందరూ పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పోటీ ప్రపంచంలో మహిళలు కూడా ప్రతి రంగంలోనూ ఉన్నత స్థానాల్లో నిలిచేందుకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళా అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని ప్రభుత్వ ప్రోత్సాహకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలకు ఏ సమస్య వచ్చినా భయపడకుండా ధైర్యంగాముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

సకాలంలో అందని వైద్యం..తల్లీబిడ్డ మృతి

- మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో ఘటన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



జిల్లా ఆస్పత్రిలో మృతి చెందిన రుక్సానా

మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లీ, బిడ్డ మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. ప్రభుత్వాసుపత్రికి ప్రసవ వేదనతో వచ్చిన ఓ మహిళకు సకాలంలో డాక్టర్లు వైద్యం అందించకపోవడంతో పండంటి బిడ్డకు కష్టం మీద జన్మనిచ్చి ఆ వెంటనే ఆమె ఆసుపత్రిలో కన్ను మూసింది. తల్లి చనిపోయిన మరికొన్ని నిమిషాల వ్యవధిలోనే పురిటి బిడ్డ చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఘటనపై వివరాలు.. గుర్రంకొండ మండలం తరిగొండకు చెందిన నజీర్ బాషా భార్య ఎస్.రుక్సాన(25), మూడవ కాన్పు ప్రసవ నొప్పులు రావడంతో ఆమె పుట్టినిల్లు అయిన మదనపల్లి మండలం సిటిఎం రోడ్డులో ఉన్న ఆరోగ్య వరం తురకపల్లికు వచ్చింది. నొప్పులు అధికం కావడంతో కుటుంబ సభ్యులు ఆమెను బుధవారం తెల్లవారి తీసుకొచ్చి మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని మేటర్నిటీ వార్డులో చేర్పించారు. ఆ సమయంలో వైద్యులు సకాలంలో స్పందించకపోవడంతో అడ్మిట్ అయిన కొంత సేపటికి అతి కష్టం మీద పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. మరికొంత సేపట్లోనే ఆమె మృత్యువాత పడింది. బాలింత రుక్సానా చనిపోయిన నిమిషాల వ్యవధిలోనే ఆమెకు పుట్టిన పండంటి మగ బిడ్డ కూడా కన్నుమూశాడు. తల్లీ, బిడ్డ ఆస్పత్రిలో మృత్యువాత పడడంతో మృతురాలి కుటుంబం సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ విషయమై వైద్యులను వివరణ కోరగా 160/110 బిపితో గర్భిణి ఆసుపత్రిలో అడ్మిట్ అయిందని చెప్పారు. రిస్కు ఉంటుందని చెప్పే ప్రసవం చేశామని, బాధగా ఉందని డాక్టర్లు తెలిపారు. బాధితులు ఆరోపిస్తున్నట్లు తమ నిర్లక్ష్యం లేదని వారు చెప్పారు.

యువగళం బహిరంగ సభకు తరలిరండి

మదనపల్లె అర్బన్: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో భాగంగా జరిగే చేనేత సదస్సు, బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని రాజంపేట పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో భాగంగా 9వ తేదీ ఉదయం 11 గంటలకు కొత్తవారిపల్లి క్రాస్ వద్ద జరిగే చేనేత సదస్సుకు చేనేత కార్మికులు పెద్దఎత్తున తరలి రావాలన్నారు. చేనేత కార్మికులు తమ సమస్యలను నారా లోకేష్ దృష్టికి తీసుకు రావాలన్నారు. 10వ తేదీ రాజంపేట పార్లమెంట్ కార్యాలయం నుండి పాదయాత్ర ప్రారంభమై సిటిఎం రోడ్, టౌన్ బ్యాంక్ సర్కిల్, బెంగళూరు బస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్, నీరుగట్టువారిపల్లి మీదుగా రంగనాథ పెట్రోల్ బంక్ వరకు సాగుతుందని, అదేరోజు సాయంత్రం మూడు గంటలకు అమ్మచెరువుమిట్ట కెఎన్ మైదానంలో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ బహిరంగ సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, యువత తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మోడెం సిద్దప్ప మాట్లాడుతూ నియోజకవర్గంలోయువగళం 500 కిలోమీటర్లు పూర్తి చేసుకోవడం జరుగుతుందన్నారు. ఇది పార్టీ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి దొరస్వామి నాయుడు, మస్తాన్, పఠాన్ ఖాదర్‌ఖాన్, ముంబై దుర్గా, శ్రీరాములు, నాదెండ్ల అరుణ్ తేజ, ప్రణయ్ రాయల్, మహబూబ్ ఖాన్ పాల్గొన్నారు.

ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి రాయచోటి

ఓటు వేయడానికి ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరి అని, పోలింగ్ స్టేషన్ లోపలికి ఎటువంటి ద్రవ పదార్థాలను అనుమతించరాదని కలెక్టర్ గిరీష పిఎస్ సూక్ష్మ పరిశీలకులకు సూచించారు. కోన శశిధర్‌తో కలిసి కలెక్టర్ గిరీష, ఎమ్మెల్సీ ఎన్నికలలో పాల్గొనే సూక్ష్మ పరిశీలకులకు బుధవారం స్థానిక స్పందన హాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ఏజెంట్లు తప్పనిసరిగా ఫొటో గుర్తింపు కార్డు కలిగి ఉండాలని అన్నారు. పోలింగ్ అధికారులు, ఏజెంట్లు, ఎన్నికల సంఘం అధీకృత వ్యక్తులు, ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వోద్యోగులు వంటి నిర్దిష్ట వ్యక్తులను మాత్రమే పోలింగ్ బూత్‌లోకి అనుమతించాలని చెప్పారు. పోటీ చేసే ప్రతి అభ్యర్థికి ఒక ఏజెంట్‌కు మాత్రమే అనుమతి ఉంటుందని ఆయన అన్నారు. పోలింగ్ ప్రక్రియను వివరించారు. పోలింగ్ ప్రక్రియను ఉదయం 8 గంటలకు మాత్రమే ప్రారంభించాలని చెప్పారు. మీడియా ప్రతినిధులు ఎన్నికల సంఘం సూచనలను పాటించాలని ఆయన సూచించారు. ఓటర్ల వద్ద సెల్‌ఫోన్, లైటర్, పెన్ను తదితర వాటిని లేకుండా సూక్ష్మ పరిశీలకులు నిర్ధారించుకోవాలని ఆయన సూచించారు. ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు ఎమ్మెల్సీ ఎన్నికలకు మైక్రో అబ్జర్వర్‌గా నియమితులైన కోనశశిధర్, ఎన్నికల ప్రక్రియలో భాగమైనందుకు బాధ్యతగా, గర్వంగా భావించాలని కోరారు. పోలింగ్ కేంద్రాల్లోని పరిస్థితులకు అనుగుణంగా ఒక్కరోజు సరిపెట్టుకోవాలని, పోలింగ్ కేంద్రంలోని సౌకర్యాలపై ఫిర్యాదు చేయవద్దని ఆయన సూచించారు. నిష్పక్షపాతంగా పోలింగ్ జరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాయచోటి రంగస్వామి, సత్యనారాయణ హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోన శశిధర్

దుమ్ముకొట్టుకుపోయిన బస్సులు

ధూళి మధ్య నిత్యం ప్రయాణాలు - కనీస సౌకర్యాలు కరువు - దుమ్ముతో నిండిన బస్సు సీట్లు - పట్టని ఆర్‌టిసి అధికారులు



తుప్పపట్టిన డ్రైవర్ కూర్చునే సీటు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి ఆర్‌టిసి బస్సులు దుమ్ముకొట్టుకుపోయినాయి. ప్రయాణికులు నిత్యం దుమ్ము దూళి మధ్య ప్రయాణం చేయాల్సి వస్తోంది. రాయచోటి జిల్లా కేంద్రం కావడంతో నలుమూల నుంచి రోజూ వందల బస్సుల్లో వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. బస్టాండ్‌లో నిర్మాణ పనులు జరగుతుండడం, రోడ్లు సక్రమంగా లేకపోవడంతో నిత్యం మట్టి అధికంగా ఉంటోంది. కనీసం బస్టాండ్‌లో సౌకర్యాలు కూడా లేవని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సులు రెండు నెలల నుంచి వాషింగ్, క్లీనింగ్ చేయడం లేదు. అడపా దడపా రూ. 50 వేలు ఖర్చు చేస్తూ శుభ్రం చేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. కాంట్రాక్టర్ బస్సులను సక్రమంగా క్లీనింగ్ చేయించడం లేదనే ఆరోపణ ఉంది. గ్యారేజ్‌లో బస్సుల మెయింటినెన్స్‌ను గాలికి వదిలేసినట్లు తెలుస్తోంది. గ్యారేజీ ఇన్‌ఛార్జితో బస్సులను స్వీపింగ్ చేయిస్తున్నారంటే కాంట్రాక్టర్‌తో అధికారులు కుమ్మక్కరనేది తెలుసుకోవచ్చు. దీనిపై డిపో అధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే కేవలం నోటీసులిచ్చి చేతులు దులుపుకొంటున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సుల్లో ఎక్కడ పడితే అక్కడ నిలపడం వల్ల దుమ్ముకొట్టుకుపోయి చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. వాటిలో ప్రయాణించే ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు స్పందించి బస్సుల శుభ్రతపై దృష్టి సారించాల్సిన అవసరమెంతైనా ఉంది.

కాంట్రాక్టర్ అందుబాటులో లేడు

కాంట్రాక్టర్ అందుబాటులో లేకపోవడం వల్లే ఇలా జరిగింది. ప్రయాణికులకు ఇలాంటి అసౌకర్యం కల్గించినందుకు బాధపడుతున్నాం. కాంట్రాక్టర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశాం. ఒక వారం అందు బాటులో రాకపోతే అతని కాంట్రాక్ట్ రద్దు చేసి కొత్త టెండర్ పిలిచి బస్సులు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటాం.

- జగదీష్, ఆర్‌టిసి ఆర్ఎం, రాయచోటి.



దుమ్ముతో నిండిపోయిన బస్సు సీట్లు

క్రైం కార్నర్

కారును ఢీకొన్న బైక్ : యువకుడి మృతి

- ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలోని మదనపల్లి రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకు వద్ద అతివేగంగా వచ్చిన బైక్ కారును ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే రాయచోటి పట్టణం నాయబ్ సాబ్‌వీధికి చెందిన జియాయుర్ రెహమాన్ స్నేహితులతో కలిసి మల్లూరమ్మ జాతరకు వెళ్తున్న సమయంలో బెంగళూరు నుండి కడపకు వెళ్తున్న ఇన్నోవా వాహనాన్ని అతివేగా ఢీకొనడంతో కారు అద్దంపై పడి దాదాపు పది అడుగుల ఎత్తుకు ఎగిరి కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలోని మృతి చెందినట్లు రాయచోటి ట్రాఫిక్ ఎస్ఐ మొహమ్మద్ రఫీ తెలిపారు. మరో ఇద్దరికి గాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గడ్డిలో కుళ్లిన మృతదేహం లభ్యం

తప్పిపోయిన తుమ్మల వెంకటరమణగా గుర్తింపు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని మద్దిరేవుల గ్రామం ఈడిగపల్లిలోని తుమ్మల వెంకటరమణ(75) గత నెల 14న తెల్లవారు జామున మూడు గంటల నుంచి కనిపించలేదని, ఆయనకు మతిస్థిమితం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు పిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వినోద్‌కుమార్ మిస్సింగ్ కేసు నమోదు చేసి తేది నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఊరికి ఒకటిన్న కిలోమీటర్ల దూరంలో ఏపుగా పెరిగిన గడ్డి ఉన్న మడిలో కుళ్లిన శవం ఉందని గ్రామస్థులు ద్వారా తెలుసుకొని పరిశీలించగా కుటుంబ సభ్యులు కుళ్లిన శవం తుమ్మల వెంకటరమణదిగా నిర్ధారించు కొని పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు ఎస్ఐ వినోద్ కుమార్ ఆదేశం మేరకు పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని కుళ్లిన శవంను పరిశీలించారు. బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పంచనామా అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని కదిరి రోడ్డులో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఘటనపై ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక నీరుగట్టుపల్లి బాబు కాలనీలో కాపురం ఉంటున్న రెడ్డిశేఖర్ కుమారుడు జీవన్ ప్రకాష్ అలియాస్ నాని(23) పిడిఎస్ బియ్యం వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం బైకులో ఎన్టీఆర్ సర్కిల్ వద్దకు సొంత పనిపై వచ్చాడు. పని ముగించుకుని తిరిగి ఇంటికి బైకులో వెళ్తుండగా మార్గమధ్యంలోని కదిరి రోడ్డు మసీదు కాంప్లెక్స్ వద్ద రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి బాధితున్ని చికిత్స నిమిత్తం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని చెప్పడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు..

మదనపల్లె అర్బన్ : మదనపల్లి, తంబళ్లపల్లి మండలాల్లో వేర్వేరుగా జరిగిన రెండు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడి మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందుకు సంబంధించి పోలీసుల కథనం మేరకు.. తంబళ్లపల్లి మండలం ఉప్పురోల్లపల్లికి చెందిన రామయ్య భార్య సిద్ధమ్మ తన కుమార్తె బెంగళూరులో ఉండడంతో ఆమెను చూసి వచ్చేందుకు ద్విచక్ర వాహనంలో తంబళ్లపల్లికి వెళుతుండగా, మార్గమధ్యంలోని బోరెడ్డికోట వద్ద బైకులో చీరచుట్టుకుని పడి తీవ్రంగా గాయపడింది. బాధితురాలని 108 సిబ్బంది జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. మదనపల్లి సిటిఎం రోడ్డు బాలాజీ నగర్‌లో కాపురముంటున్న ఎస్.భాష బైకు అదుపుతప్పి పడి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుని జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విష ద్రావణం తాగి ఇద్దరు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ కలహాలతో కురబలకోట, పెద్దమండెం మండలాల్లో ఇద్దరు విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఇందుకు సంబంధించి పోలీసుల కథను మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. కురబలకోట మండలం, పగడాలోల్లపల్లికి చెందిన లక్ష్మన్న భార్య వెంకటలక్ష్మము(70) కుటుంబ సభ్యులతో గొడవపడి మనస్థాపంతో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు ఆమెకు ప్రథమ చికిత్సలు అందించి వార్డుల్లో చేర్పించారు. ఘటనపై ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పెద్దమండెం మండలం కలిచర్లకు చెందిన ఎర్రప్ప కొడుకు లక్ష్మయ్య (35) తన కొడుకును పినతల్లి పద్మావతి బెంగళూరుకు తీసుకెళ్లిపోయి తల్లిదండ్రులకు చూపించకుండా వేధిస్తోందని మనస్థాపంతో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి బాధ్య తల్ని చికిత్సల నిమిత్తం ఆస్పత్రికి తరలించగా డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి వార్డులో చేర్పించారు. పై ఘటనలపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పట్టుబడిన కారు,ఎర్రచందనంతో ఫ్లయింగ్ స్క్వాడ్

కారుతో సహా ఎర్రచందనం స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు అటవీశాఖ నిఘా విభాగం దాడిలో కారుతో సహా ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్ఒ ఎన్.వెంకటరమణ తెలిపారు. ఎఫ్ఆర్ఒ తన సిబ్బందితో కలిసి గంగవరం చెక్ పోస్ట్ దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా బుధవారం ఒక ఇన్నోవా కారులో 9 ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేస్తుండగా స్వాధీనం చేసుకొని, పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ పార్టీ కార్యాలయానికి తరలించామన్నారు. ఈ సందర్భంగా కారు డ్రైవర్ పారిపోయాడని, కారుతో సహా ఎర్రచందనం దుంగల విలువ రూ.15 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ దాడిలో ఫ్లయింగ్ స్క్వాడ్ పార్టీ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.ప్రతాప్, ఎస్.కుప్పుస్వామి, ప్రొటెక్షన్ వాచర్లు టి.ప్రభుతేజ, డి.చరణ్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి : జడ్జి

ప్రజాశక్తి-గాలివీడు

క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె.ఫైజున్నీ పేర్కొన్నారు. బుధవారం రవిచంద్ర పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటుచేసిన పాఠశాల వార్షికోత్సవ సమావేశాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నేను లెక్చరర్‌గా పని చేస్తూ, నాన్న కోసం పరీక్షలు రాసి జడ్జి స్థాయికి ఎదిగానని చెప్పారు. కష్టపడి చదవాలని, విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ప్రోత్సహించడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించాలని పేర్కొన్నారు. వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి మాట్లాడుతూ మానవాళిలో అభివృద్ధి అనేది విద్యపై ఆధారపడి ఉందని, ప్రపంచంలో పోటీ పడి ఉన్నతమైన విద్యను అభ్యసించి మంచి ప్రయోజకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సైజు థామస్, డైరెక్టర్ సింటో ఇమ్మానుయేలు, ప్రిన్సిపాల్ బినోద్, వైసిపి మైనార్టీ నాయకుడు ఖాదర్ మోదీన్, ప్రధానోపాధ్యాయుడు గరుడప్ప, ఉపాధ్యాయులు రామకృష్ణ, రమేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



రాయచోటి: సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు



కలకడ : సన్మానం పొందిన మహిళలతో ప్రజాప్రతినిధులు



నిమ్మనపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు



కోడూరు : స్వర్ణలతను సన్మానిస్తున్న సిబ్బంది



పెద్దమండ్యం :మహిళలకు బహుమతులు అందిస్తున్న ఎపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రభుత్వాలు మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించినప్పుడే సమాజ పురోగతి సాధ్యమని ఐక్యోపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి డి.గంగాదేవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాగ్య లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న గంగాదేవి మాట్లాడుతూ మహిళలు తమకు తామే కించ పరుచుకనే ఆలోచనలనుండి బయటకు రావాలన్నారు. పురుషాధిక్య సమాజంలో మహిళలు చదువు లేని కారణంగా సరైన గౌరవం, సమానత్వం లేదన్నారు. వీటికి పేదరికం, నిరుద్యోగం సమస్య గా ఉన్నాయని తెలిపారు. మూఢనమ్మకాలను వదిలి శాస్త్రీయ దృక్పథంతో పని చేయాలన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యస్.జాబీర్, సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి పి.బంగారుపాప, ఉపాధ్యక్షురాలు పి.ఖాజాబి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి యస్.ముంతాజ్, కెవిపిఎస్ జిల్లా కో–కన్వీనర్ డిసి.వెంకటయ్యలు మాట్లాడుతూ పురాతన కాలం నుంచి నేటి వరకు సమాజాభివృద్ధి శ్రామిక మహిళలు కీలక పాత్ర పోషించారని అన్నారు. నేడు పాలకుల విధానాల పరంగా మహిళా సంక్షేమం కుంటు పడుతోందని, ఫలితంగా మహిళల సంఖ్య తగ్గుతుందని అన్నారు. వరకట్నం, బాల్యవివాహాలు, లింగ వివక్ష, శ్రమలో సమానంగా ఉన్నా వేతనాల్లో అసమానతలు కారణమన్నారు. జాతీయోద్యమంలో, సోషలిస్టు ఉద్యమంలో సమాన హక్కుల కై అసువులు బాసిన వీర వనితల ముఖ్య ఘటనలు వివరించారు. మహిళా సాధికారత అమలుచేయని ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలని, మహిళలు స్వతంత్ర ఆలోచనలతో శ్రమకు తగ్గ వేతనం కొరకు, రాజకీయాపదవులలో భర్తల ఆధిపత్య ధోరణులు మారకుండా సమానత్వం సాధించలేరని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం కొరకు ఉన్న చట్టాలు హక్కుల అమలుకు ఐక్య ప్రతిఘటన కార్యాచరణ చేస్తామని చెప్పారు. మహిళల బాధలు ప్రస్ఫుటించే విధంగా అబ్బవరం స్వప్న పాడిన పాట మహిళలందరిని ఆకట్టుకుంది. అనంతరం ఠాణా దగ్గర మహిళల చట్టాలు హక్కులు పటిష్టంగా అమలు చేయాలని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు సుమలత, అరుణ, రమీజా, రాములమ్మ, సురేఖ, సుహాసిని, శంకరమ్మ ముకులరెడ్డెమ్మ, ఆశావర్కర్ కవితలు పాల్గొన్నారు. **రాయచోటి :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా మహిళా విభాగంతో కలిసి కలెక్టర్ గిరీష, జాయింట్ కలెక్టర్ తమీమ అన్సారీయా ను బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలిసి సన్మానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యర్రపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కార్యదర్శి జి. గురుప్రసాద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కవిత, జిల్లా కార్యదర్శి కుసుమ కుమారి, జిల్లా కోశాధికారి యం. సుధాకర్ రాజు,జాయింట్ సెక్రటరీ కృష్ణవేణి, రాయచోటి తాలూకా అధ్యక్షులు ఓ. సాయికుమార్, కార్యదర్శి సుజిత్,ఉపాధ్యక్షులు కే. కవిత, కె. సదాశివ రెడ్డి,యం. శ్రీనివాసులు నాయక్,హౌస్ బిల్డింగ్ డైరెక్టర్ యం. సిద్దయ్య, పి. రాజా తదితరులు పాల్గొన్నారు.**రాయచోటి :** మహిళలు అన్ని రంగాలలో రానించి ఆర్థికాభివృద్ధి చెందాలని స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ ధనలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు అని రంగాలలో రాణిస్తున్నారని, ప్రతి మహిళా విద్యావంతురాలై ఆర్థికంగా మరింత అభివృద్ధి చేయాలన్నారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకు రాగలమని, ఆడపిల్లలకు చదువు ఎంతో అవసరమని, తల్లిదండ్రులు ఆడ, మగ అనే తేడా లేకుండా పిల్లలు ఇద్దరినీ సమానంగా చదివించాలని చెన్నారు. మహిళలు కుటుంబ బాధ్యతతో పాటు పిల్లల సంరక్షణ, ఇతర బాధ్యతలు నిర్వర్తించడం జరుగు తున్నదని, ఇలా ప్రతి అంశంలో మహిళ కీలకంగా మారిందని చెప్పారు. నేడు ప్రపంచం మొత్తం మహిళల అభివృద్ధి వైపు చూస్తోందనన్నారు. పురాణకాలం నుంచి మహిళలల చరిత్ర, వారి గొప్పతనం ఈనాటి ఆధునిక కాలంలో మహిళా సాధికారత గురించి విపులంగా వివరించారు. ఈ సందర్భంగా వైద్య, పోలీసు, సచివాలయం, ఐసిడిఎస్ డిపార్ట్మెంట్స్ , గుడ్ నైబర్స్ ఎన్‌జిఒ ఆర్గనైజేషన్‌లో ప్రతిభ చూపిన మహిళా ఉద్యోగులను శాలువాతో సన్మానించారు. కార్యక్రముములో సిడిపిఒలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం మరింత పారదర్శకంగా చట్టాలను అమలులోకి తోసుకురావాలని ఎపి వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి శోభ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సందర్భంగా రాచవేటివారిపల్లి పంచాయతీ గారబురుజు దళితవాడలో ఆసంఘం కమిటీ సభ్యులు, గ్రామీణ మహిళలతో కలిసి మహిళల అభివృద్ధిపై సమావేశాన్ని ఏర్పాటుచేసి, అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కొరకు ప్రభుత్వం చట్టాలను మరింత కఠినంగా అమలు చేసి, నిందితులను శిక్షించి, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. 55 సంవత్సరాలు నిండిన గ్రామీణ మహిళలకు రూ.5వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపివివియు కమిటీ సభ్యులు నాగరత్న, రామలక్ష్మి, మల్లేశ్వరి, యశోదమ్మ, బుజ్జమ్మ, విశ్వనాథ్, జయన్న తదితరులు పాల్గొన్నారు. **కలకడ :** ప్రతి మహిళను దేవతగా పరిగణించాలని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు చిదంబరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సంబేపల్లి మండలం గుట్టపల్లిలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళను దేవతగా పరిగణించి నప్పుడే మహిళ అనే పదానికి అర్థం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్, పుట్టపర్తి నియోజకవర్గ పరిశీలకులు ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు పొత్తూరి రవీంద్రనాయుడు, సర్పంచ్ పాల వెంకటరమణ నాయుడు, వైసిపి నాయుకులు బ్రహ్మానందరెడ్డి, శివారెడ్డి, లక్ష్మికరరెడ్డి, రమణారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, పూల కృష్ణయ్య, గుట్టపల్లి గ్రామ వాలంటీర్లు,గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** ఒక శిశువు తల్లి గర్భంలో పడినప్పటి నుండి ఆమె తనువు చాలించే వరకు ఎన్నో రకాలైన రక్షణ చట్టాలు మహిళలకు అనుకూలంగా ఉన్నాయని మదనపల్లి టూటౌన్ సిఐ ఎస్.మురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ మహిళా సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు.ఈ సృష్టిలో అత్యంత ప్రాముఖ్యమైన పాత్ర మహిళా మూర్తిదేనని, వారి సేవలను వెలకట్ట లేమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కొరకు ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన దిశ యాప్‌ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రిన్సిపల్ రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మదనపల్లికి చెందిన ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లలితమ్మను, ప్రముఖ సిరికల్చర్ సైంటిస్ట్ డాక్టర్ దీపను, ప్రిన్సిపల్ రమాదేవిని సిఐ సన్మానించారు. **నందలూరు :** చదువుతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని చైర్మన్, మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ, నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కే.లత అన్నారు. అరవపల్లి షాది ఖానాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వ హించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న నేపథ్యంలో న్యాయవిజ్ఞానం కూడా కావాలన్నారు. జాతీయ న్యాయ సేవ ప్రాధికార సంస్థ, జాతీయ మహిళా కమిషన్, జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న న్యాయ విజ్ఞాన సదస్సులో సైబర్ క్రైమ్స్ అగైనెస్ట్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ అనే అంశంపై న్యాయమూర్తి మాట్లాడుతూ ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్, వాట్సాప్ అధికంగా వాడడం వల్ల మహిళలు ఎలాంటి నేరాల ను ఆహ్వానిస్తున్నారని ఉదాహరణలతో వివరించారు. కార్య క్రమంలో తహశీల్దార్ ఉదయ్ శంకర్‌రాజు, మున్నూరు సిఐ పుల్లయ్య, న్యాయవాదులు దాసరి నరసింహులు, సిహెచ్.ఆనంద్ కుమార్, అనుదీప్ జైసింహ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మహిళలు అన్నిరంగాల్లో అద్భుత ప్రగతి సాధించాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్.ఎం.పర్వీన్ తాజ్ ఆకాంక్షించారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు మహిళలు సమాజంలో రాణించాలంటే విద్యలో ముందుండాలని, మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేసి మహిళా విద్యను ప్రోత్సహించి, మహిళలకు రాజకీయంగా స్థానిక సంస్థలలో 33 శాతం రిజర్వేషన్ కల్పించారని అన్నారు. తండ్రి ఆస్తిలో మహిళలకు సమాన హక్కును కల్పించి ప్రోత్సహించడం జరిగిందన్నారు. అలాగే చంద్రబాబు నాయుడు మహిళా అభ్యున్నతి కోసం మహిళా ఆర్థిక స్వాలంబన కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టి మహిళలను సమాజంలో ఉన్నతమైన స్థానంలో ఉంచారన్నారు. కార్యక్రమంలో పుష్ప,విజయ్ కుమారి పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మహిళా సంఘ చైర్మన్ దీపా అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో కవితా, నాగజ్యోతి, మధులతా, సుమలత , ఎన్‌జిఒ కార్యదర్శి రెడ్డి శేఖర్, అసోసియేట్ అధ్యక్షులు గిరిధర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి సోమశేఖర్ పాల్గొన్నారు. **వెలుగు ఆధ్వర్యంలో :** మండలంలోని కోళ్ళబైలు పంచాయితీ, అమ్మచెరువుమిట్ట లోని వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమంలో అంత ర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మైనింగ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జి.షమీమ్ అస్లాం, ఫోర్డ్ సంస్థ అధ్యక్షులు జె.లలిత, వెలుగు కమిటీ మెంబర్ ఎం.సుజాత హాజరయ్యారు. **రాజంపేట అర్బన్ :** బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది సరస్వతి తెలియజేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, బాలికల వసతి గృహంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన పోస్కో, విడాకులు, భరణము, గృహహింస, వరకట్నం వంటి అనేక చట్టాల పట్ల అవగాహన కలిగించారు. తల్లిదండ్రులకు సంబంధించిన ఆస్తి విషయంలో మహిళలకు కూడా పురుషులతో సమానంగా ఆస్తిహక్కు ఉంటుందని తెలిపారు. మరో న్యాయవాది శోభారాణి మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన వివిధ చట్టాల గురించి సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శోభారాణి, కోర్టు సిబ్బంది, హాస్టల్ సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** రైల్వే కోడూరు ఇన్‌ఛార్జి సబ్ పోస్ట్‌మాస్టర్‌గా పనిచేస్తున్న నాగసముద్రం స్వర్ణలత కోడూరు పోస్ట్ ఆఫీస్ నందు అత్యధికంగా ఖాతాలు ప్రారంభించినందుకు గాను అవార్డు అందు కున్నారు. ప్రపంచ మహిళ మహిళా దినోత్సవ సందర్భంగా సహద్యోగులు, స్థానిక పోస్ట్ ఆఫీస్ ఏజెంట్లు కలసి అవార్డు పొందిన సబ్ పోస్ట్ మాస్టర్ చేతులమీదుగా కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** పట్టణంలోని విజయనగర్ కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా ఐద్వా నాయకులు భాగ్యమ్మ మాట్లాడుతూ మహిళలు మహిళల్ని సమానంగా చూడాలని, లింగ వివక్షత పోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు లక్ష్మీదేవి, రెడ్డి, ప్రసన్న, కె.ప్రమీల, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు. **పెద్దమండ్యం :** మహిళలు సామాజికంగా, రాజకీయంగా, ఇతర అన్ని రంగాల్లో రాణించి విజయం సాదిందిస్తున్నారని ఎపిఎం మధుశేఖర్ పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యక్రమంలో ఘనంగా మహిళలు దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలుకు ఆటల పోటీలు నిర్వ హించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సిసి లు శంకర మ్మ, ఆదిలక్ష్మి ఎంఎస్ అధ్యక్షరాలు సరస్వతి, కార్యదర్శి రేష్మ, సంగమిత్రాలు రెడ్డెప్ప, రామయ్య, అరుణ, అంజలి, మహిళ సంగమిత్రాలు పాల్గొన్నారు. **పీలేరు:** స్థానిక ఎంజెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కల్లూరు ఎస్ఐ జ్యోతి రెడ్డి ముఖ్యఅతిథిగా హాజర య్యారు. సమాజంలో మహిళల పట్ల వివక్ష తగదని చెప్పారు. తృతీయ సంవత్సర విద్యార్థులకు వర్క్‌షాప్ అన్ బల్డింగ్ ఇంగ్లీష్ ఫ్లూయన్సీ కాన్ఫి డెన్స్ మీద ఒక రోజు శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో నలందా ఆశోక్ కిరణ్, అధ్యా పకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** మండల కేంద్రంలోని శ్రీజ మహిళ పాలఉత్పత్తులు కంపెనీ బిఎంసి పరిధిలో దేవలంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీజ ఏరియా మేనేజర్ లక్ష్మీరెడ్డి పాల్గొని మహిళల ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో పిఐబి అధికారిని యాస్మిన్ సూపర్వైజర్ ఆంజనేయులు, రమేష్, శివ, మహిళా పాడి రైతులు పాల్గొన్నారు.



మహిళా పోలీసును సన్మానిస్తున్న పీడీ ధనలక్ష్మి



కురబలకోట : విద్యార్థినికి బహుమతి అందిస్తున్న డాక్టర్



నందలూరు : మాట్లాడుతున్న జడ్జి కె.లత



అశోక్ దంపతులను పరామర్శిస్తున్న నారా లోకేష్

చంద్రబాబును జన్మాంతం గుర్తించుకుంటాం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఆజన్మాంతం గుర్తించు కుంటామని మండలంలోని చింతలవారిపల్లి గ్రామానికి చెందిన అశోక్, భార్గవి దంపతులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చింతపర్తిలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలుసుకొని కృతజ్ఞతలు తెలిపారు. గతంలో తాము వైసిపిలో ఉన్న సమయంలో జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో తన భర్త అశోక్ ప్రమాదం భారిన పడి తీవ్రంగా గాయపడ్డాడని భార్య భార్గవి ఆవేదన వ్యక్తం చేసింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తన భర్త అశోక్ పరిస్థితి విషమంగా ఉన్న సమయాన ఆ రోజుల్లో వైసిపి తమని పట్టించుకోలేదని, ఆ సమయాన నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తమ కుటుంబానికి ఆసరాగా నిలిచారని చెప్పారు. అప్పటి సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.30లక్షలు మంజూరు చేయించి, తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్నారని తెలిపారు. అనంతరం నారా లోకేష్ అశోక్ దంపతులను పరామర్శించారు.

రూ.12 లక్షలతో పాఠశాల అభివృద్ధి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సోమాపురం దళితవాడ ప్రాథమిక పాఠశాలను రూ.12 లక్షలతో నాడు- నేడు నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే ప్రహరీ, తరగతి గదిలో చప్పట వంటి పనులు కొనసాగుతున్నాయి. గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు అదనపు గదుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి రవిశంకర్ తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో నాడు-నేడు ద్వారా ఖాదర్‌పల్లె ప్రాథమిక పాఠశాలకు రూ.36 లక్షలతో మూడు గదులు, ఉర్దూ పాఠశాలకు రూ.36 లక్షలతో మూడు అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయన్నారు. సోమాపురం దళితవాడ పాఠశాలకు రూ.12లక్షలు, నరహరిపురం ప్రాథమిక పాఠశాలకు రూ.12 లక్షలు, నాగులపల్లి, లక్ష్మీపేట, చిన్నగురువలూరు, నక్కలదిన్నె ప్రాథమిక పాఠశాలలకు రూ.5 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. వీటితోపాటు రెండో విడత నాడు-నేడు ద్వారా చాపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రూ.60 లక్షలు, నరహరిపురం హైస్కూలుకు రూ.69 లక్షలు, చియ్యపాడు హైస్కూల్‌కు రూ.63 లక్షలు, అయ్యవారిపల్లి హైస్కూల్‌కు రూ.42 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని, పనులు కొనసాగుతున్నాయని ఎంఇఒ తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని వెంకటేశ్వర స్వామి కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కెఎస్ఆర్ స్కూటీల షోరూంను బుధవారం మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తొండూరు పార్టీ ఇన్‌ఛార్జి వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన స్కూటీలు అందించాలన్నారు. వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ చిన్నప్ప, అన్వర్ బాషా, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న ప్రతినిధులు

ఎస్‌హెచ్‌జిలకు మెగా చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

మహిళా దినోత్సవం సందర్భంగా యూనియన్ బ్యాంక్ నుండి రుణంగా 20 స్వయం సహాయక సంఘాలకు రూ.3 కోట్ల మెగా చెక్కును సమాఖ్య ప్రతినిధులకు అందజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం మండల సమాఖ్యలో సమాఖ్య ప్రతినిధుల, గ్రామ సమాఖ్యలతో ఎపిఎం వెంకటరమణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటలు పోటీలు నిర్వహించారు. కబడ్డీ, లెమన్ స్పూన్, మ్యూజికల్ చెయిర్స్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. కేక్ కట్ చేశారు. గతంలో సమాఖ్య ప్రతినిధులుగా పనిచేసిన పాత అధ్యక్షులు సుమలత, శ్యామల, మండల సమాఖ్య మహిళా సిబ్బంది సిసి సుబ్బరత్నమ్మకు సన్మానం చేశారు. కార్యక్రమానికి యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజశేఖరరెడ్డి, కళ్యేష్, సురేష్, సిసిలు, యానిమేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎంపీ

పులివెందుల రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని వార్డు వాలంటీర్లను, కన్వీనర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక భాకరాపురంలోని వైఎస్ఆర్ ఆడిటోరియంలో ఆయన గృహ సారథులు. సచి వాలయ కన్వీనర్లు. వైసిపి నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, హాల్ గంగాధర్‌రెడ్డి, వేల్పుల రాము, బయపరెడ్డి, నాగన్న, స్వామి, శివారెడ్డి, అంబ కపల్లె బాబు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ సంబరాలు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలగడలో హోలి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. యువత కేరింతల కొడుతూ రంగులు వేసుకుని హోలి సంబరాలు ఘనంగా నిర్వహించారు. **మదనపల్లె అర్బన్ :** అఖిల భారత బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు పి.అమరేంద్రనాయక్ ఆధ్వర్యంలో మదనపల్లి నక్కలదిన్నె తండాలో వైభవంగా హోలి ఉత్సవాలుఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ విగ్రహం ఎదుట నృత్యాలు చేశారు. అలాగే సేవాలాల్ మహారాజ్కి పూజ నిర్వహించి ప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎబిబిఎస్ జిల్లా సెక్రెటరీ వేణుగోపాల్ నాయక్, ట్రెజరర్ ప్రభాకర్ నాయక్, యూత్ సెక్రెటరీ మనోహర్ నాయక్, ముని స్వామి నాయక్, తిరుమలేష్ నాయక్, సరస్వతి పాల్గొన్నారు. **కలికిరి :** మండల వ్యాప్తంగా హోలి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. సిఐఎటి–3 స్కూల్, సిఆర్‌పిఫ్ కమాండెంట్ కెసి నిర్మల్ అధికారులు, జవాన్లుతో కలసి హోలి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మతానికి చెందిన ప్రజలు పూర్తి ఉత్సాహంతో, వినోదంతో జరుపుకుంటారని అన్నారు. హోలి వేడుకల్లో సింగ్, కదమ్‌సింగ్, ఎస్‌పి.నందన్వార్ డిప్యూటీ కమాండెంట్లు హనుమాన్‌రామ్, కె.రవి కుమార్, కె.గిరిధర్ ఈ సంస్థలోని ఇతర ర్యాంకులు అధికారులు, వారి కుటుంబ సభ్యులు, ట్రైనీలు పాల్గొని ఆనందోత్సవాలు మధ్య సంబరాలు జరుపుకున్నారు.

నేడు ప్రభుత్వ విప్ రాక

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ప్రభుత్వ విప్, కోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు గురువారం వైసిపి కార్యాలయంలో గృహసారథులతో సమావేశం నిర్వహించనున్నారని పార్టీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి ప్రజలకు ఎలా వివరించాలో గృహసారథులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు.

గుండెపోటుతో విఆర్ఎ మృతి

గాలివీడు : ఎగువ గొట్టివీడు కస్బా చెందిన విఆర్ఎ షేక్ అమీర్‌సాబ్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతి చెందిన సమాచారం తెలిసిన వెంటనే డిప్యూటీ తాహశీల్దార్ తిమ్మారెడ్డి తన సిబ్బందితో వెళ్లి కుటుంబానికి నివాళులర్పించి, సంస్కరణకై ఖర్చులను వారి కుటుంబ సభ్యులకు అందించారు. అమీర్ సబ్ మృతిపై సిఐటియు మండల అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఉపాధ్యక్షులు భాస్కర్, విఆర్ఎల జిల్లా అధ్యక్షుడు భోగిశ్వరయ్య, కుటుంబానికి నివాళులర్పించారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్లకు పెరిగిన వడ్డీ : మేనేజర్

ఎర్రగుంట్ల : ఎస్‌బిఐలో డిపాజిట్ దారులకు ఎక్కువ వడ్డీ అందిస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్లు రవికుమార్, శశికుమారి తెలిపారు. ఆ మేరకు బ్యాంకు సిబ్బంది బుధవారం నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారులు వెంబడి ర్యాలీ నిర్వహిస్తూ, ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌బిఐలో ఫిక్స్ డిపాజిట్‌పై వడ్డీ రేట్లు 7.90శాతం పెరిగిందన్నారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్లు మస్తాన్ సాహెబ్, శ్రీదేవి, రవి, చేతన్‌కుమార్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.